# తాతగారి డైరీ

-ఆచంట వి.సుబ్రమణ్యం

శీతాకాలం మధ్యాహ్నం మూడుగంటలు. ఈజీచైర్‌లో కూర్చుని పేపరు చదువుతూ మధ్యమధ్యలో బాల్కనీనుంచి కాంపౌండ్‌లోకి తొంగి చూస్తున్నాను. మామిడిచెట్టుకు తాడు ఉయ్యాల, అందులో కేరింతలు కొడుతూ ఊగుతున్న నా మనుమరాలు వెనుకనుంచి తోస్తూ ఊపుతున్న నా కూతురు కొడుకు, మనవడు విశాల్. క్రింద నేలంతా పరుచుకున్న పచ్చగడ్డి, ఆ పక్కనే బాదం చెట్టు మీద రామచిలుకలు. ఆ చెట్టుమీంచి ఈ చెట్టు మీదకు ఎగురుతున్నాయి.

కొంచెం పక్కగా గేటుకు కొద్ది దూరంలో ఫోర్డ్ ఐకన్ బ్లాక్ కలర్ కారు పార్కు చేసి వుంది. వెయ్యి గజాల ఇల్లు నాది. చుట్టూ మిలట్రీ ఆఫీసర్స్ కాలనీ అది. ఆ దృశ్యం చూస్తుంటే యాభై ఏళ్ల వయసులో ఉన్న నాకు చాలా ఉల్లాసంగా ఉంది.

నా చిన్నతనంలో నాన్నగారిది పుణెలో చిన్న ఉద్యోగం. రాజమండ్రిలో తాతగారిది గోదావరి ఒడ్డున చాలా పెద్ద కలప వ్యాపారం. సడెన్‌గా తాతగారు పోవడం, అప్పుల్లో పడి ఆస్తంతా పోవడంతో నాన్నగారు బాగా బతికిన ఆ ఊరిలో ఉండలేక ఓ ఫ్రెండ్ సహాయంతో పుణెలో కాపురం పెట్టారు. అద్దె ఎక్కువ ఇచ్చుకోలేక ఒక గది వంటిల్లు పోర్షన్‌లో అమ్మా నాన్న ముగ్గురు పిల్లలతో కాపురం.

నా చదువెప్పుడూ మేడ మెట్ల క్రిందే. ఈ గోలకు తోడు అప్పుడప్పుడు ఊర్ల నుంచి వచ్చే చుట్టాల్ని రైలుస్టేషన్‌కి వెళ్లి మరీ తీసుకురావడం కొంప దూళ్ల సంతలా ఉండేది.

సంవత్సరానికొకసారి వేసవి సెలవుల్లో మా అమ్మ పుట్టిలు తుని అమ్మమ్మగారి ఇంటికెళ్లినప్పుడు మాత్రం లైఫ్ అద్భుతంగా ఉండేది. అరెకరం స్థలంలో తాతగారిది చాలా పెద్ద బంగ్లా. వీధి గుమ్మం పక్కగా రేకుల షెడ్డు , గోడకి నక్షత్రం మార్కు ఎరువు అని ఓ బోర్డు. మా మామయ్య వ్యాపారం తాలూకు బోర్డు అది. ఎప్పుడూ ఎరువులు అమ్మడం మటుకు నేను చూడలేదు.

ఇంటి ముందు ద్రాక్ష తీగ పందిరి, నారింజ, బత్తాయి చెట్లు, పెద్ద గిలక బావి, దాని పక్కన పెద్ద స్నానాల షెడ్డు, ఇక పెరట్లో మరో ఔట్ హౌస్ బంగళా పెంకుల ఇల్లది. తాతగారిది చాలా భారీ విగ్రహం. ఎప్పుడూ నవ్వడం చూళ్లేదు. పంచకట్టు, లాల్చీ, చేతిలో పొన్నుకర్ర.

ఆయనకు ఏడుగురు కూతుళ్లు, ఒక కొడుకు. వందెకరాల మాగాణీ మామిడి తోటలూను. ఆయన వీధి గుమ్మంలో వుంటే పిల్లలంతా పెరట్లో , ఆయన పెరట్లో వుంటే మేమంతా వీధి గుమ్మం దగ్గర రేకుల షెడ్డులో ఆటలు. నేనీరోజు నా మనుమలు ఈ కాంపౌండ్‌లో ఆడుకుంటుంటే ఇంత బాగా ఎంజాయ్ చేస్తున్నాను, మరి ఆయన ఆ రోజుల్లో అమ్మమ్మగారింట్లో ముప్పై నాలుగు మంది మనుషులు... ఎండాకాలం సెలవుల్లో మేము అంతలా అల్లరి చేస్తుంటే ఏమైనా ఆనందించేవాడా అని డౌట్. ఎందుకంటే నా జీవితంలో ఇవన్నీ సాధించి ఈమాత్రం ఎత్తుకు ఎదిగేసరికి నాతో పాటు నా పిల్లలూ చిన్న చిన్న ఇళ్లల్లోనే వుండేవారు. మనుమలు పుట్టేసరికి ఈమాత్రం ఎదిగాను.

తాతగారిది కూడా మొదట్లో ఉమ్మడి కుటుంబంలో వ్యవసాయం. ఆయన సంతానం పెద్దది అవడంతో అందులోంచి బయటకు వచ్చి వేరు కాపురం పెట్టారు.

ఆయన కూడా జీవితంలో అన్నీ సంపాదించేసరికి నోటితో లంక పొగాకు చుట్టతోపాటు మనుమలూ కూడా పుట్టేసారు. ఆయన సంతానం కంటే ఆయన మనుమలుగా ఆ ఇంట్లో మేమే ఎక్కువ ఎంజాయ్ చేసామన్నమాట.

నాకెందుకో ఓసారి ఆయనన్న మాటకి కోపం వచ్చి ఆయన పోయినప్పుడు కూడా చూడడానికి కూడా వెళ్లలేదు.

అది కూడా ఆయన ఆర్థికంగా దెబ్బతిన్న మా కుటుంబం గురించి హేళనగా మాట్లాడినందుకు. కానీ నాకు ఆ ఊరన్నా, ఆ ఇల్లన్నా విపరీతమైన ఇష్టం.

కారణం నేను ఆ ఇంట్లో పుట్టడమే. ఇప్పటికీ వీలున్నప్పుడల్లా ఏ రెండేళ్లకో ఓసారి వెళ్లి మేనమామ పిల్లల్ని చూస్తుంటాను.

ఈ విషయమై నా శ్రీమతితో అంటే "మీరలా ఎందుకనుకోవాలి?

ఆ రోజుల్లో ఇప్పటి తాతల్లా అన్నీ బయటడేవారు కాదు. ఆయన కూడా లోలోపలే ఆనందించి ఉండవచ్చుకదా"

"మరి ఇప్పుడా విషయం ఎలా తెలుస్తుంది?" అన్నాను.

"నిజంగా తెలుసుకోవాలంటే మార్గం ఉండదా ఏమిటి? ఆ ఇంట్లో ఆయన పాత డైరీలు దొరుకుతాయేమో చూడండి."

ఆ ఆలోచన వచ్చిందే తడవుగా ఆ రోజు రాత్రే విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో తునికి బయల్దేరాను.

ఇంటికి వెళ్లగానే అత్తయ్య మంచినీళ్లిచ్చింది. కాసేపు కబుర్లయ్యాక మేడమీదకి వెళ్లి పాత కాలం చెక్కల అలమారలోకి చూసాను. ఆయన రాసిన పాకెట్ డైరీలు వరుసగా పేర్చి ఉన్నాయి.

అందులోంచి 1959 సంవత్సరం డైరీ తీయగానే ఫలానా విజయలక్ష్మి మగబిడ్డను ప్రసవించింది. సమయం తెల్లవారుఝామున 4.30. తల్లీబిడ్డా క్షేమం అని వుంది.

ఆయన నన్ను కోపంతో తిట్టిన తేదీ, సంవ

త్వరం గుర్తున్నాయి.

డైరీ తీసాను. ఆ విషయం అందులో ప్రస్తావించారు.

నా గురించి రాస్తూ "తిట్టినందుకు కొంచెం బాధనిపించింది. జబ్బు తగ్గడానికి మందెలానో వాడు జీవితంలో ఎదగాలీ అంటే ఆ మాత్రం తిట్టక తప్పదు చేదు అనిపించినా. లేకపోతే వీడి బ్రతుకు వాళ్ల నాన్నలాగే గొర్రెతోక బెత్తెడు అన్న చందాన వుంటుంది. ఈ ఇంట్లో అల్లరి చేయడానికి వీడికి కాక ఇంకెవ్వరికి వుంటుంది అర్హత. వాడిలో చురుకు, తెలివి రెండూ ఉన్నాయి. వాడిని అవమానించినందుకు ఇప్పుడు నన్ను తిట్టుకున్నా రేపు తప్పకుండా నన్ను మెచ్చుకుంటాడు'' అని రాసుకున్నారు.

నాకు నిజంగానే కళ్లు చెమర్చి కళ్లు మసకబారాయి.

డైరీ మూసేసి జాగ్రత్తగా అందులో పెట్టేసా ఆ పుస్తకాల మధ్యలో.

క్రిందకి వచ్చి భోజనం చేసి పడుకున్నా. సాయంత్రం తిరుగు ట్రైన్ గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి రిజర్వేషన్ ఉంది.

అత్తయ్యనడిగి తాతగారి పాత ఫోటో ఒకటి తీసుకున్నా.

ఇప్పుడు నా ఇంట్లో హాల్లో గంధపు దండ వేసి వున్న తాతగారి ఫోటో చూస్తుంటే 'మొత్తానికి సాధించావురా' అని నన్ను మెచ్చుకున్నట్లనిపించింది.

☆

